


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4 PM
www.suryaa.com
బుధవారం
21-01-2026
పేజీలు: 02




## ‘దల్ దల్’ ట్రైలర్ విడుదల

బాలీవుడ్ నటి భూమి పెడ్నేకర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ ‘దల్ దల్’. ఈ సిరీస్‌కు అమిత్ రాజ్ గుప్తా దర్శకత్వం వహిస్తుండగా.. విక్రమ్ మల్హోత్రా, సురేష్ త్రివేణి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సిరీస్ జనవరి 30 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కాబోతుంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. ఈ కథ ముంబై క్రైమ్ బ్రాంచ్ కొత్త డిసిపిగా బాధ్యతలు చేపట్టిన రీటా ఫెరీరా అనే ధైర్యవంతురాలైన ఆఫీసర్ చుట్టూ తిరుగుతుంది. నగరాన్ని గజగజ వణికిస్తున్న ఒక క్రూరమైన సీరియల్ కిల్లర్‌ను పట్టుకోవడానికి ఆమె చేసే సాహసోపేతమైన ప్రయత్నాలు, ఈ క్రమంలో ఆమె ఎదుర్కొనే వృత్తిపరమైన సవాళ్లు మరియు ఆమె వ్యక్తిగత గతంలోని చేదు జ్ఞాపకాలను ఈ సిరీస్‌లో అత్యంత ఆసక్తికరంగా చూపించనున్నారు. తాజాగా విడుదలైన ట్రైలర్ అత్యంత డార్క్ మరియు వయోలెంట్‌గా ఉండి ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా ఒక సీరియల్ కిల్లర్ తన బాధితుల నోట్లో మొబైల్ ఫోన్లు, మాంసం ముక్కలు కుక్కి అత్యంత కిరాతకంగా చంపే దృశ్యాలు ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయి. ఈ చిత్రంలో భూమితో పాటు ఆదిత్య రావల్, సమర టిజోరి, గీతా అగర్వాల్, అనంత్ నారాయణ్, తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




## ఆకట్టుకుంటున్న ‘హనీ’ టీజర్

నవీన్ చంద్ర కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ‘హనీ’. ఈ సినిమాకు కరుణకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. OVA ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. టీజర్ చూస్తుంటే.. ఈ చిత్రం నిజ జీవిత సంఘటనల ఆధారంగా, సమాజంలోని మూఢ నమ్మకాలు మరియు అంధ విశ్వాసాల నేపథ్యంలో రూపొందింది. సాధారణ హారర్ సినిమాలకు భిన్నంగా, కేవలం భయపెట్టడమే కాకుండా ఒక మార్మిక ప్రపంచాన్ని ఈ టీజర్‌లో ఆవిష్కరించారు. చీకటి, నిశ్శబ్దం, మర్మమైన శక్తుల కలయికతో దర్శకుడు కరుణ కుమార్ వెన్నులో వణుకు పుట్టించే విజువల్స్‌ను వెండితెరపైకి తీసుకొస్తున్నారు. ప్రధాన పాత్రలో నవీన్ చంద్ర నటన, దివ్య పిళ్లై, దివి, రాజా రవీంద్రల గూఢమైన పాత్రలు సినిమాపై మరింత ఆసక్తిని కలిగిస్తున్నాయి. అజయ్ అరసాడ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రధాన బలమని చెప్పవచ్చు. నాగేష్ బానెల్ సినిమాటోగ్రఫీ, మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటింగ్ ఈ చిత్రానికి సాంకేతిక హంగులను జోడించాయి.

### చీరల కోసం ఉదయం 4 గంటల నుంచి

# మహిళల క్యూ.. ఒక్కోటి రూ. 2.50 లక్షలు

కర్ణాటకలోని మైసూర్ సిల్క్ చీరలకు 2026లోనూ విపరీతమైన డిమాండ్ కొనసాగుతోంది. ఒక్క చీర కోసమే మహిళలు తెల్లవారుజామున 4 గంటల నుంచే క్యూ కడుతున్నారు. ప్రైవేట్ మార్కెట్లో నకిలీ పట్టు విక్రయాలు జరుగుతుండటంతో.. జీఐ ట్యాగ్ ఉన్న స్వచ్ఛమైన ఈ మైసూర్ సిల్క్ చీరలు కొనేందుకు ఎగబడుతున్నారు. అయితే ఒక్కో చీర ఖరీదు గరిష్ఠంగా రూ.2.50 లక్షలకు విక్రయిస్తున్నా.. మహిళలు మాత్రం వెనక్కి తగ్గడం లేదు. నైపుణ్యం కలిగిన నేత కార్మికుల కొరత కారణంగా సిల్క్ చీరలు ఉత్పత్తి చేయడం తగ్గిపోయి.. షోరూమ్‌ల వద్ద తీవ్ర కొరత ఏర్పడిందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. కర్ణాటక సిల్క్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (కేఎస్ఐసీ) షోరూమ్‌ల ముందు తెల్లవారుజాము నుంచే మహిళలు క్యూ కట్టడం ఇప్పుడు ఆ రాష్ట్రంలోనే కాదు.. వాటికి సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ కావడంతో దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. చీర కోసం గంటల తరబడి వేచి చూడటం.. కేవలం ఒకే ఒక చీర కొనే అవకాశం ఉండటం మైసూర్ సిల్క్ పట్ల ఉన్న విపరీతమైన క్రేజ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది. అయితే ఆ షోరూమ్‌లో ఒక్క మైసూర్ సిల్క్ చీర ప్రారంభ



ధర రూ.23 వేలు కావడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇక ఆ చీర జరి పనితనాన్ని బట్టి గరిష్ఠంగా ఒక్కో చీర ఏకంగా రూ.2.50 లక్షలు పలుకుతోంది. అయినప్పటికీ ఆ మైసూర్ సిల్క్ చీరలు కొనుగోలు చేసేందుకు.. కన్నడ మహిళలు తెల్లవారుజామునుంచే ఎదురుచూపులు చూస్తున్నారు. అయితే ఒక్కో కస్టమర్‌కు కేవలం ఒకటే చీర ఇస్తామని కండిషన్ పెట్టారు. దానికోసం ముందుగా టోకెన్ కూడా తీసుకోవాల్సి ఉంటుంది. కర్ణాటక సిల్క్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ తయారు చేసే చీరలకు జీఐ ట్యాగ్ (జియోగ్రఫికల్ ఇండికేషన్) ఉంది. అంటే ఇవి 100 శాతం స్వచ్ఛమైన పట్టు, వెండి లేదా బంగారు జరితో తయారు చేస్తారు.

మైసూరు సిల్క్ చీరల కొరతకు కారణాలు


నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. ఈ మైసూరు సిల్క్ చీరలను నేసే నేత కళాకారులు చాలా తక్కువ మంది ఉన్నారు. కొత్తగా చేరిన వారికి బేసిక్ ట్రైనింగ్ ఇవ్వడానికి కనీసం 6 నుంచి 7 నెలల సమయం పడుతుంది. దీంతోపాటు చీర నాణ్యత ఏ మాత్రం తగ్గకుండా ఉండటం కోసం కేఎస్ఐసీ కేవలం తన సొంత యూనిట్లలో మాత్రమే ఈ మైసూరు సిల్క్ చీరలను ఉత్పత్తి చేస్తోంది. 2025లో ఈ చీరల ఉత్పత్తిని పెంచినప్పటికీ.. డిమాండ్‌తో పోలిస్తే అది చాలా తక్కువగా ఉండటంతో కొరత కొనసాగుతోంది. గత 2, 3 ఏళ్లలో సోషల్ మీడియా ద్వారా మైసూర్ సిల్క్ చీరల ప్రాచుర్యం బాగా పెరిగింది. దీంతో మునుపెన్నడూ లేని విధంగా ఈ చీరలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. మైసూర్ సిల్క్ పేరుతో మార్కెట్లో చైనీస్ సిల్క్ లేదా నకిలీ పట్టు విక్రయాలు బాగా పెరుగుతుండటంతో.. అసలు సిల్క్ చీరలకు ప్రాధాన్యత పెరుగుతోంది. ఇటీవల కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవారు కొలువున్న తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లో ఒక కాంట్రాక్టర్ సుమారు రూ.54 కోట్ల విలువైన నకిలీ పట్టు దుపట్టాలను సరఫరా చేసినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించడం దేశవ్యాప్తంగా సంచలనం రేపిన సంగతి తెలిసిందే.

## పూరి జగన్నాథ్ ఆలయానికి బాంబు బెదిరింపు



ఒడిశాలోని పూరి జగన్నాథ్ ఆలయాన్ని పేల్చివేస్తామని మంగళవారం సోషల్ మీడియాలో ఓ పోస్టు వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో ఇవాళ భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆన్‌లైన్ పోస్టు ఆధారంగా ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఫేస్‌బుక్‌లో ఆ పోస్టు కనిపించింది. ఆలయాన్ని పేల్చడంతో పాటు బీజేడీ రాజ్యసభ ఎంపీ సుభాషిస్ కుంతియాను అటాక్ చేస్తామని కూడా ఆ పోస్టులో హెచ్చరించారు. షాపింగ్ కాంప్లెక్స్‌ను కూడా పేల్చివేస్తామన్నారు. అయితే ఆ సోషల్ మీడియా పోస్టు కోసం ఓ మహిళ అకౌంట్‌ను వాడుకున్నారు. ఆమె పేరుతో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫేక్ యూజర్ ఐడీని క్రియేట్ చేసి భయభ్రాంతులకు గురిచేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

## ఇరాన్ ను భూస్థాపితం చేయాలని ఆదేశించా: ట్రంప్



ఇరాన్, అమెరికాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు పీక్ కు చేరాయి.. తమ లీడర్ కు హాని తలపెడితే ప్రపంచమే తగలబడిపోతుందని ఇరాన్ హెచ్చరించగా.. తనను హత్య చేస్తే ఇరాన్ భూస్థాపితం అవుతుందని ట్రంప్ కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఓ మీడియా సంస్థతో ట్రంప్ మాట్లాడుతూ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై ఇరాన్ హత్యాయత్నం చేస్తే.. తాను బతికి ఉన్నా, చనిపోయినా సరే.. ఆ దేశాన్ని భూస్థాపితం చేయాలని తన సలహాదారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని ట్రంప్ చెప్పారు. ఇరాన్ లో జరుగుతున్న అల్లర్లకు మద్దతు పలుకుతున్న ట్రంప్ పై ఆ దేశ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇరాన్ లో కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపైనా ఖమేనీ మండిపడ్డారు. ఈ క్రమంలోనే తమ నాయకుడిపై చేయి వేయాలని చూస్తే ఆ చేతిని తెగనరుకుతామని, ఖమేనీకి ఏదైనా జరిగితే ప్రపంచాన్ని తగలబెడతామని ఇరాన్ సైన్యానికి చెందిన ఉన్నతాధికారి ఒకరు హెచ్చరించారు. దీనిపై ట్రంప్ తాజాగా స్పందిస్తూ.. తనను చంపేయాలని చూసినా, చంపేసినా మీరు భూమ్మీదే ఉండరని తీవ్ర హెచ్చరికలు చేశారు.




## ‘బోర్డర్ 2’ కొత్త ట్రైలర్ విడుదల

సన్నీ డియోల్, వరుణ్ ధావన్ ప్రధాన పాత్రల్లో నటించిన వార్ డ్రామా ‘బోర్డర్ 2’. ఈ చిత్రం రిపబ్లిక్ డే కానుకగా.. జనవరి 23న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి తాజాగా ‘ది బ్రేవ్స్ ఆఫ్ ది సాయిల్’ (#TheBravesOfTheSoil) పేరుతో కొత్త ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. భారత సైనికుల అసమాన త్యాగాలను, దేశభక్తిని కళ్లకు కట్టేలా ఉన్న ఈ ట్రైలర్ ప్రస్తుతం ఆకట్టుకుంటుంది. ప్రముఖ సంగీత దర్శకుడు మిథూన్ స్వరాలు, సోనూ నిగమ్ గానం, మనోజ్ ముంతాషిర్ సాహిత్యం ఈ ట్రైలర్‌కు అదనపు ఆకర్షణగా నిలిచింది. 1971 భారత్-పాక్ యుద్ధ నేపథ్యంలో సాగే ఈ భారీ సీక్వెల్‌లో సన్నీ డియోల్‌తో పాటు వరుణ్ ధావన్, దిల్జిత్ దోసాంజ్, అహాన్ శెట్టి ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ మరియు నేవీ విభాగాలకు చెందిన వీర సైనికులుగా కనిపించబోతున్నారు. ముఖ్యంగా నిజ జీవిత యుద్ధ వీరులైన మేజర్ హోషియార్ సింగ్ దహియా, ఫ్లయింగ్ ఆఫీసర్ నిర్మల్ జిత్ సింగ్ సెఖోన్ వంటి హీరోల సాహసాలను ఈ సినిమాలో వెండితెరపై ఆవిష్కరిస్తున్నారు. రిపబ్లిక్ డే కానుకగా జనవరి 23, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ప్రారంభమైన అడ్వాన్స్ బుకింగ్స్‌లో కేవలం 48 గంటల్లోనే రికార్డు స్థాయిలో టిక్కెట్లు అమ్ముడుపోవడం ఈ సినిమా క్రేజ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది.

## భారీగా పెరిగిన బంగారం ధరలు



దేశీయ మార్కెట్లో బంగారం ధర సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. బుధవారం మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (MCX)లో పసిడి ఫ్యూచర్స్ ధర మునుపెన్నడూ లేనంత గరిష్ఠ స్థాయికి చేరింది. అమెరికా-యూరప్ మధ్య వాణిజ్య యుద్ధం ముదురుతుందన్న భయాలు, డాలర్ బలహీనపడటంతో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం కొనుగోళ్లకు మొగ్గుచూపారు. దీంతో ఎంసీఎక్స్‌లో ఫిబ్రవరి గోల్డ్ ఫ్యూచర్స్ ధర ఏకంగా 4.25శాతం (సుమారు రూ. 4,100) పెరిగి 10 గ్రాములకు రూ.1,56,970 వద్ద సరికొత్త ఆల్ టైమ్ రికార్డును నమోదు చేసింది.బంగారం బాటలోనే వెండి కూడా పయనించింది. ఎంసీఎక్స్ మార్చి సిల్వర్ ఫ్యూచర్స్ ధర 2.71శాతం పెరిగి కిలోకు రూ. 3,32,451కి చేరింది.



## వెడ్డింగ్ రూమర్స్

తెలుగుతోపాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది మృణాళ్ ఠాకూర్. ఈ మరాఠీ ముద్దుగుమ్మ లైనప్‌లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలున్నాయి. కాగా ఈ బ్యూటీ ధనుష్‌తో క్లోజ్‌గా కనిపిస్తుందని.. ఇద్దరూ ఫిబ్రవరి 14న పెళ్లిపీటలెక్కేందుకు రెడీ అవుతున్నారంటూ పుకార్లు షికారు చేశాయి. అయితే అలాంటిదేమీ లేదని అవన్నీ వట్టి పుకార్లేనని మృణాళ్ ఠాకూర్ సన్నిహితవర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉంటే అందరి దృష్టిని ఈ టాపిక్ నుంచి మళ్లిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఆసక్తికర అప్‌డేట్ షేర్ చేసింది మృణాళ్ ఠాకూర్. కొత్త సంవత్సరం, కొత్త స్క్రిప్ట్, కొత్త ప్రారంభం.. అంటూ ఇన్‌స్టా స్టోరీలో రాసుకొచ్చింది. తాను హైదరాబాద్‌లో ఉన్నానని చెబుతూ.. కొత్త తెలుగు సినిమా కోసం పనిచేస్తున్నట్టు హింట్ ఇచ్చింది.



## మరోసారి తండ్రి కాబోతున్న జేడీ వాన్స్

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, భార్య ఉషా వాన్స్ దంపతులు శుభవార్తను పంచుకున్నారు. త్వరలోనే తమ కుటుంబంలోకి నాలుగో బిడ్డ రాబోతున్నట్టు వారు ప్రకటించారు. ఉష నాలుగో బిడ్డకు జన్మనివ్వబోతున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. జులై చివరి నాటికి పండంటి మగబిడ్డ తమ జీవితాల్లోకి రానున్నాడని తెలిపారు. జేడీ వాన్స్, ఉషా వాన్స్ దంపతులు 2014లో వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం వీరికి ఈవాన్, వివేక్, మిరాబెల్ అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ ప్రకటన వెలువడిన వెంటనే వారి అభిమానులు, మద్దతుదారులు, సన్నిహితులు సోషల్ మీడియా వేదికగా వాన్స్ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.



## దావోస్‌లో రేవంత్ రెడ్డితో చిరంజీవి

స్విట్జర్లాండ్లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా రేవంత్ ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ సదస్సుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కీలక అధికారులు హాజరయ్యారు. సదస్సులో మెగాస్టార్ చిరంజీవి కూడా పాల్గొన్నారు. స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ లో చిరంజీవి ఉన్నట్టు తెలుసుకున్న రేవంత్ రెడ్డి... సదస్సుకు ఆయనను ఆహ్వానించారు. రేవంత్ ఆహ్వానం మేరకు దావోస్ సదస్సుకు చిరంజీవి వెళ్లారు. ఈ సందర్భంగా, తెలంగాణ ప్రభుత్వం ఆవిష్కరించిన ‘‘తెలంగాణ రైజింగ్ 2047’’ విజన్ డాక్యుమెంట్‌ను చిరంజీవి ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా చిరంజీవితో రేవంత్ ముచ్చటిస్తూ... ఇటీవల కుటుంబంతో కలిసి ‘మన శంకర వరప్రసాద్ గారు’ సినిమాను చూశానని, సినిమా చాలా బాగుందని తెలిపారు.


సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

## తిలకం పెట్టుకున్నాడని..
# స్కూల్ నుంచి హిందూ విద్యార్థి బహిష్కరణ

బ్రిటన్ రాజధాని లండన్‌లో.. ఓ భారతీయ సంతతి విద్యార్థికి దారుణ అవమానం జరిగింది. ముఖ్యంగా అతడు నుదుటన తిలకం పెట్టుకున్నాడనే నెపంతో.. ఎనిమిదేళ్ల విద్యార్థిని పాఠశాల యాజమాన్యం తీవ్ర వేధింపులకు గురిచేసింది. ఈ వివక్షను భరించలేక ఆ చిన్నారి చివరకు పాఠశాలనే వదిలి పెట్టాల్సి వచ్చింది. బ్రిటన్‌లోని హిందువులు, భారతీయుల ప్రయోజనాల కోసం పనిచేసే 'ఇన్‌సైట్ యూకే' సంస్థ ఈ దారుణాన్ని బట్టబయలు చేసింది. సదరు విద్యార్థి తన మత సంప్రదాయాల ప్రకారం తిలకం దిద్దుకుని పాఠశాలకు వెళ్లగా.. అక్కడి సిబ్బంది దానిని అభ్యంతరకరంగా భావించారు. విద్యార్థి మతపరమైన ఆచారాల గురించి పదే పదే ఆరా తీస్తూ అతడిని అసౌకర్యానికి గురిచేశారు. కేవలం తరగతి గదిలోనే కాకుండా విరామ సమయంలో ఇతర పిల్లలతో కలిసి ఆడుకుంటున్నప్పుడు కూడా హెడ్ టీచర్ ఆ బాలుడిపైనే ప్రత్యేకంగా దృష్టి సారించేవారని సమాచారం. దీంతో ఆ చిన్నారి భయపడిపోయి.. తోటి



విద్యార్థులతో కలవలేక ఒంటరివాడిగా మారిపోయాడు. క్షణ క్షణం భయం భయంగా ఒక్కడే కూర్చుని ఆ పసి బాలుడు వణికిపోయాడు. బాలుడి పరిస్థితిని గమనించిన తల్లిదండ్రులు తమ మత విశ్వాసాల గురించి, తిలకం ప్రాముఖ్యత గురించి పాఠశాల యాజమాన్యానికి వివరించే ప్రయత్నం చేశారు. అయితే వారి వివరణను ఏమాత్రం పట్టించుకోని యాజమాన్యం.. తమ ధోరణిని మార్చుకోలేదు. దీంతో చేసేదేమీ లేక పిల్లాడి మానసిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులే.. బాలుడిని ఆ స్కూల్ నుంచి తీసి.. వేరే స్కూల్లో వేశారు. అయితే ఈ ఉదంతంపై 'ఇన్‌సైట్ యూకే' సంస్థ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది కేవలం ఒక బాలుడి సమస్య మాత్రమే కాదని.. సదరు పాఠశాల అనుసరిస్తున్న వివక్షాపూరిత చర్యల వల్ల ఇప్పటి వరకు మొత్తంగా నలుగురు హిందూ విద్యార్థులు ఆ స్కూల్ నుండి వెళ్లిపోయారని వెల్లడించింది. బ్రిటన్ చట్టాల ప్రకారం మతం, సంప్రదాయాల ఆధారంగా ఎవరినైనా వివక్షకు గురిచేయడం తీవ్రమైన నేరం. ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. విద్యార్థులపై ఇలాంటి సంఘటనలు దీర్ఘకాలిక మానసిక ప్రభావం చూపుతాయని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి సర్కారు స్పందించి.. ఈ ఘటనపై చర్యలు తీసుకుంటుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ చర్యలు తీసుకుంటే మాత్రం యాజమాన్యంపై కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుంది.




# ఆర్మీ వ్యాన్ ఢీ కొని బాలుడి దుర్మరణం

సికింద్రాబాద్ పరిధిలోని తిరుమలగిరిలో విషాదం చోటుచేసుకుంది. కొడుకును స్కూలులో దింపి రావడానికి స్కూటీపై బయలుదేరిన ఓ తల్లి రోడ్డు ప్రమాదానికి గురైంది. స్కూటీ అదుపుతప్పి కిందపడగా.. వెనక నుంచి వచ్చిన ఆర్మీ వ్యాన్ వారిపైకి ఎక్కింది. ముందు టైర్ ఎక్కడంతో బాలుడు అక్కడికక్కడే చనిపోగా.. తీవ్రంగా గాయపడిన తల్లిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. తిరుమలగిరిలోని ఆర్మీ స్కూలు వద్ద జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ ప్రమాదంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వాహనదారుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు. కేసు నమోదు చేసుకుని విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై దాడిని ఖండించిన కేటీఆర్

అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడిపై దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. విజయుడిపై కాంగ్రెస్ సీనియర్ నేత, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి చేసిన ఈ దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన బహిరంగ దాడి అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాన్ని భయపెట్టేందుకు, గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ నేతలు దిగజారిన రాజకీయానికి పాల్పడుతున్నారనడానికి ఈ ఘటన నిదర్శనమన్నారు. ప్రజల చేత ఎన్నికైన ఎమ్మెల్యేను అవమానిస్తూ శారీరక దాడికి దిగడమనేది... కాంగ్రెస్ ఎంత దిగజారిందో స్పష్టంగా చూపుతోందని కేటీఆర్ మండిపడ్డారు. చట్టం, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలపై కాంగ్రెస్‌కు గౌరవం లేదని మండిపడ్డారు. ఈ దాడిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఎంపీ మల్లు రవి తక్షణమే క్షమాపణ



చెప్పాలని డిమాండ్ చేశారు.
ఈ ఘటనకు సీఎం రేవంత్ రెడ్డి నైతిక బాధ్యత వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతిపక్షాన్ని బెదిరింపులతో కాదు, ప్రజల తీర్పుతోనే ఎదుర్కోవాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరిస్తూ, ప్రజాస్వామ్య పద్ధతుల్లో గట్టిగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

## చిరంజీవి సినిమాలో
# కృతి శెట్టి

సినిమాల్లో ఒక హిట్ కొట్టడం కంటే ఆ హిట్‌ను కొనసాగిస్తూ అవకాశాలు దక్కించుకోవడమే అసలైన సవాల్. ఈ విషయాన్ని చాలా మంది హీరోహీరోయిన్ల కెరీర్ స్పష్టంగా చెబుతుంది. ఇప్పుడు అదే పరిస్థితిని ఎదుర్కొంటున్న హీరోయిన్ కృతిశెట్టి గురించి టాలీవుడ్‌లో మళ్లీ చర్చ మొదలైంది. 'ఉప్పెన' సినిమాతో ఒక్కసారిగా స్టార్‌డమ్ తెచ్చుకున్న కృతి... ఆ తర్వాత వరుసగా సినిమాలు చేసినా ఆశించిన స్థాయి విజయాలు మాత్రం దక్కలేదు. మంచి నటిగా గుర్తింపు ఉన్నప్పటికీ, కమర్షియల్‌గా పెద్ద హిట్ లేకపోవడంతో ఆమె కెరీర్ కొంత స్లో అయిందనే చెప్పాలి. అయితే ఇప్పుడు ఆమెకు మరోసారి భారీ అవకాశం దక్కినట్టు ఇండస్ట్రీ వర్గాలు చెబుతు న్నాయి. ఇటీవలే 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న మెగాస్టార్.



## జంగారెడ్డిగూడెంలో రక్తపాతం..
# నలుగురు మహిళలపై గొడ్డలితో దాడి

భూవివాదం ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరిగిన దారుణ ఘటనలో ఓ వ్యక్తి నలుగురు మహిళలపై గొడ్డలితో దాడి చేశాడు. ఈ దాడిలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెంలోని ఎస్సీ పేటలో నివసించే కలపాల జిలుగులమ్మ (47) కుటుంబానికి, ఆమె మేనల్లుడైన ముప్పిడి వివేక్‌కు మధ్య కొన్నేళ్లుగా భూవివాదం ఉంది. వారసత్వంగా వచ్చిన ఎకరం 11 సెంట్ల పొలం విషయంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇరు కుటుంబాల మధ్య వాగ్వాదం తీవ్రస్థాయికి చేరింది. దీంతో ఆగ్రహంతో విచక్షణ కోల్పోయిన వివేక్, ఇంట్లోని గొడ్డలి తీసుకువచ్చి జిలుగులమ్మపై దాడికి పాల్పడ్డాడు. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన తల్లి చుక్కమ్మ, కుమార్తెలు ధనలక్ష్మి, ఉషారాణిలపై కూడా విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ ఘటనలో



తీవ్ర గాయాలపాలైన జిలుగులమ్మ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. స్థానికులు వెంటనే గాయపడిన ముగ్గురిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో చుక్కమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న డీఎస్పీ రవిచంద్ర, సీఐ సుభాష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది.

## కార్గిల్ తరహాలో జైషే ఉగ్రవాదుల బంకర్..
# 12 వేల అడుగుల ఎత్తులో

జమ్మూ కాశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాల పర్వత ప్రాంతాల్లో ఉగ్రవాదుల మనుగడ సాగించేందుకు ఏర్పాటు చేసుకున్న పద్ధతులను చూసి భద్రతా బలగాలే ఆశ్చర్యపోతున్నాయి. సముద్ర మట్టానికి 12 వేల అడుగుల ఎత్తులో.. గడ్డకట్టే చలిలో కూడా నెలల తరబడి నివసించేలా జైషే మహ్మద్ ఉగ్రసంస్థకు చెందిన ముష్కరులు.. ఒక రహస్య కోటను నిర్మించుకున్నారు. రాళ్లు, కాంక్రీటుతో నిర్మించిన ఈ కార్గిల్ తరహా బంకర్‌ను సోమవారం భద్రతా బలగాలు గుర్తించి.. పూర్తిగా ధ్వంసం చేశాయి. ఈ ఆపరేషన్‌లో కొందరు ఉగ్రవాదులు పారిపోగా.. తప్పించుకున్న ఉగ్రవాదుల కోసం డ్రోన్లు, స్నిఫర్ డాగ్స్‌తో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

బంకర్‌లో దొరికిన నిల్వలు

చలికాలం మొత్తం బయటకు రాకుండా బంకర్ లోపలే గడిపేలా ఉగ్రవాదులు భారీగా ఆహార నిల్వలను సిద్ధం చేసుకున్నారు. బంకర్‌ను సోదా చేయగా.. 50 మ్యాగీ ప్యాకెట్లు, 20 కిలోల బాస్మతి బియ్యం, 15 రకాల మసాలాలు, టమోటాలు, ఆలుగడ్డలు వంటి తాజా కూరగాయలు దొరికాయి. వంట గ్యాస్, పొయ్యి, గిన్నెలు, చలి కాచుకోవడానికి ఎండు కలపను కూడా ఉగ్రవాదులు అక్కడ పోగు చేసుకున్నట్లు భద్రతా బలగాల తనిఖీల్లో వెల్లడైంది. ఆదివారం మధ్యాహ్నం ఆ బంకర్‌ను గుర్తించిన భద్రతా బలగాలు దాన్ని చుట్టుముట్టిన సమయంలో జైషే మహ్మద్ ఉగ్రవాదులు ఒక్కసారిగా వారిపై గ్రెనేడ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో మొత్తం 8 మంది సైనికులు గాయపడగా.. వారిలో ఉత్తరాఖండ్‌కు





చెందిన స్పెషల్ ఫోర్స్ పారాట్రూపర్ హవల్దార్ గజేంద్ర సింగ్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలోనే ఆయనను చికిత్స కోసం తరలించగా.. ఆస్పత్రిలోనే సోమవారం వీరమరణం పొందారు. ఉగ్రవాదులు చీకటిని ఆసరాగా చేసుకుని పక్కనే ఉన్న దట్టమైన అడవుల్లోకి పారిపోయినట్లు సైన్యం తెలిపింది. పరారీలో ఉన్న ఉగ్రవాదులను ఏరివేసేందుకు సైనికులు.. ఆ ప్రాంతం మొత్తం జల్లెడ పడుతున్నారు.

లోకల్ నెట్‌వర్క్ పై కన్ను

12 వేల అడుగుల ఎత్తులో అన్ని రకాల సదుపాయాలతో బంకర్ నిర్మించారంటే స్థానికుల సహకారం లేకుండా సాధ్యం కాదని భద్రతా సంస్థలు భావిస్తున్నాయి. ఈ క్రమంలో నలుగురు స్థానికులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పాకిస్తాన్ మూలాలు ఉన్న జైషే మహ్మద్ ఉగ్ర సంస్థ కమాండర్లు సైఫుల్లా, ఆదిల్‌లు ఆ ప్రాంతంలో నక్కి ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో పాకిస్తాన్ ఉగ్రవాదులు ఎలాంటి దాడులకు పాల్పడకుండా సరిహద్దుల్లో ఆపరేషన్ త్రాషి-Iను భారత సైన్యం మరింత ముమ్మరం చేసింది.

## భార్యాభర్తలు కొట్లాడుకునేందుకు
# కోర్టులే దొరికాయా?: సుప్రీంకోర్టు

భార్యాభర్తలు కలహించుకోవడానికి కోర్టులే దొరికాయా ? అంటూ సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. వైవాహిక జీవితంలో తలెత్తే గొడవలకు కోర్టులను యుద్ధభూములుగా మార్చుకుని వ్యక్తిగత కక్ష సాధింపులకు ఉపయోగించుకోవడాన్ని అనుమతించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కోర్టుల్లో ఆరోపణలు, ప్రత్యారోపణలతో కేసులను మరింత జటిలం చేయటం తప్ప సమస్య పరిష్కారం కాదని పేర్కొంది. ఈ నేపథ్యంలో త్వరితగతిన పరిష్కారం కోసం మధ్యవర్తిత్వ మార్గాన్ని అనుసరించడం మంచిదని సూచించింది. ఈ విధానం ద్వారా అనేక కేసుల్లో సానుకూల ఫలితాలు వస్తున్నాయని తెలిపింది. వివాహం జరిగిన తర్వాత కేవలం 65 రోజులే కలిసి జీవించి, దాదాపు పదేళ్లుగా వేరువేరుగా ఉంటున్న ఓ జంటకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ



వివాహ బంధం పూర్తిగా కోలుకోలేని స్థితికి చేరుకుందని పేర్కొంటూ, ఆర్టికల్ 142 కింద ఉన్న విస్తృత అధికారాలను వినియోగించి విడాకులు మంజూరు చేసింది. వైవాహిక వివాదాల్లో ఇరుపక్షాలు సమస్యను పరిష్కరించడంపై కాకుండా, అవతలి పక్షానికి ఎలా బుద్ధి చెప్పాలనే దానిపైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నట్లు ధర్మాసనం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. కొన్నిసార్లు కృత్రిమ మేధ వంటి సాంకేతికతలను ఉపయోగించి తప్పుడు ఆధారాలు సృష్టిస్తున్న ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది.

# మెటాలో మళ్లీ లేఆఫ్స్

టెక్ దిగ్గజం మెటాలో ఉద్యోగుల కోతలు కొనసాగుతున్నాయి. తన డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన మెటావర్స్, వర్చువల్ రియాలిటీ విభాగాల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ భారీ లేఆఫ్స్‌కు తెరలేపారు. తాజా నిర్ణయంతో దాదాపు 15,000 మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోనున్నారు. ఇప్పటివరకు మెటావర్స్ కోసం బిలియన్ల కొద్దీ డాలర్లను మెటా కుమ్మరించింది. అయితే, ప్రస్తుత మార్కెట్ ట్రెండ్‌కు అనుగుణంగా తన వ్యూహాన్ని మార్చుకుంది. వీఆర్ హెడ్‌సెట్ల కంటే ఏఐ ఆధారిత స్మార్ట్ గ్లాసెస్, వేరబుల్ గ్యాడ్జెట్లపై పెట్టుబడి పెట్టడం మేలని భావించిన మెటా అందుకు అనుగుణంగానే ఈ పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. ఈ లేఆఫ్స్ నిర్ణయంపై ఓకులస్ వ్యవస్థాపకుడు పామర్ లక్కీ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. 2017లో కొన్ని




వివాదాల కారణంగా జుకర్‌బర్గ్ చేత తొలగించబడ్డ పామర్.. ఇప్పుడు అదే జుకర్‌బర్గ్ నిర్ణయాన్ని సమర్థించారు. "VR రంగం ఆరోగ్యకరంగా ఎదగాలంటే ఇలాంటి కఠిన నిర్ణయాలు అవసరమే. అనవసరమైన విభాగాలను తొలగించడం ద్వారా కంపెనీ తన లక్ష్యాన్ని సులభంగా చేరుకోగలదు" అని ఆయన పేర్కొన్నారు. గత రెండేళ్లుగా మెటా వరుసగా వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తూనే ఉంది.